సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు

పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల బాధ్యులు ఆందోళనకు దిగారు.

- 8లో▸



ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఓటరు నమోదు శిబిరాలను పరిశీలించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

$30^0 / 24^0$

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

ఉండమ్మా.. గిఫ్ట్ ఇస్తా

శుభకార్యాలకు వచ్చిన అతిథులకు రిటర్న్ గిఫ్ట్‌లు

- వేడుకను కలకాలం గుర్తుంచుకునే అవకాశం
- ఆర్థిక స్థోమతకు తగ్గట్టు కానుకలు
- నగరంలో పెరుగుతున్న సంస్కృతి



ఒకప్పుడు ఏ ఇంట్లో శుభకార్యం జరిగినా కానుకలు వెల్లువలా వచ్చిపడేవి. ఇప్పుడు ట్రెండ్ మారింది. ఎవరు శుభకార్యం చేసినా కట్న కానుకలు అతిథులు, బంధువుల నుంచి స్వీకరించట్లేదు. శుభకార్యానికి హాజరైన వారికే రిటర్న్ గిఫ్టులు ఇస్తున్నారు. గతంలోనూ ఈసంస్కృతి ఉంది. కానీ గ్రేటర్ వరంగల్ నగరంలో ఇటీవల బాగా పెరిగింది. అతిథులకు కృతజ్ఞత తెలుపుతూ.. విలువైన వస్తువులను రిటర్న్ గిఫ్టులుగా ఇస్తున్నారు. పెరిగిన కానుకల సంస్కృతిపై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ.

- కాజీపేట

- కాజీపేటకు చెందిన వైద్యురాలు శ్రీలక్ష్మి పెద్ద కూతురు అలేఖ్యశ్రీ పుష్పాలంకరణ కార్యక్రమం గ్రాండ్‌గా జరిపారు. బంధుమిత్రులను ఆహ్వానించి భారీ ఫంక్షన్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక కానుక తీసుకొచ్చి అలేఖ్య చేతుల్లో పెట్టారు. అనంతరం ఫంక్షన్ నిర్వాహకులు వచ్చిన అతిథులందరికీ విలువైన వెండి కుంకుమ భరిణీలు అందించారు.

- నగరానికి చెందిన కాంట్రాక్టర్ చినుముల రామారావు చిన్న కుమార్తె లావణ్యకు ఇటీవల వివాహం జరిపారు. వచ్చిన బంధువులు కొంతమంది డబ్బును చదివించారు. మరికొంత మంది వివిధ కానుకలు ఇచ్చారు. ఫంక్షన్ ముగిసిన తర్వాత చక్కటి లగేజీ బ్యాగులను అతిథులకు అందించారు.

కార్యక్రమమేదైనా కానుకలివ్వడం.. కట్నాలు చదివించడం ఆనవాయితీ. బహుమతులు ఇచ్చి ఫొటోలు దిగడం ఇప్పటికీ నడుస్తోంది. కానీ.. ఇప్పుడిప్పుడే చాలా చోట్ల కట్న కానుకలు స్వీకరించడం లేదు. ఇదే విషయాన్ని ఇన్విటేషన్ కార్డుల్లోనూ మెన్షన్ చేస్తున్నారు. శుభకార్యానికి హాజరైన అతిథులు, బంధువులను ఖాళీ చేతులతో పంపకుండా రిటర్న్ గిఫ్టులు ఇస్తున్నారు. హాజరైన వారికి కృతజ్ఞత తెలుపుతూ.. తాము చేసిన శుభకార్యం చిరకాలం గుర్తుండేలా నిర్వాహకులు కానుకలు అందిస్తున్నారు.

నూతన ఒరవడి



గత సంప్రదాయాలకు భిన్నంగా శుభకార్యాల్లో రిటర్న్ గిఫ్టులు ఇస్తున్నారు. ఏ ఫంక్షన్ జరిగినా నిర్వాహకుల ఆర్థిక స్థోమతను బట్టి అతిథులకు రిటర్న్ గిఫ్టలను అందిస్తున్నారు. వారిచ్చే బహుమతులు చిరకాలం గుర్తుండిపోతున్నాయి.

- బర్ల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఎస్సై, కాజీపేట

కానుకల్లో కేటగిరీలు

కార్యక్రమాన్నిబట్టి కానుకలు మారుతున్నాయి. పుష్పాలంకరణ ఫంక్షన్లలో ఒక రకం, వివాహ వేడుకల్లో మరో రకమైన కానుకలు ఇస్తున్నారు. పుట్టినరోజు, పుష్పాలంకరణ, నిశ్చితార్థ కార్యక్రమాల్లోనూ తమ స్థోమతకు తగినట్లుగా విలువైన బాక్స్‌లను అందిస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఫంక్షన్ నిర్వాహకులు స్టీల్, కుంకుమ భరిణీలు, టిఫిన్ బాక్స్‌లు అందిస్తున్నారు. ఇక వివాహ వేడుకల ఫంక్షన్లలో కలంకారీ బ్యాగులు, దేవుడి ప్రతిమలు, వెండి వస్తువుల్ని రిటన్ గిఫ్టులుగా అందిస్తున్నారు. ఇప్పుడీ సంస్కృతి గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించిందని నగరానికి చెందిన ఓ ఈవెంట్ మేనేజర్ చెబుతున్నారు.

సండే స్పెషల్

ఫంక్షన్లలో కట్నాల నిరాకరణ



గతంలో ఏ ఫంక్షన్ జరిగినా.. తమ ఆర్థిక స్థోమతకు తగ్గట్టుగా ఫంక్షన్ల నిర్వాహకులకు అతిథులు గిఫ్టులు అందించేవారు. కట్నాలు చదివించేవారు. ప్రస్తుతం ఈ విధానం ఆటకెక్కుతోంది. చాలామంది కట్న, కానుకలు స్వీకరించడానికి నిరాకరిస్తున్నారు.

- రావుల నవీన్‌కుమార్, చిరువ్యాపారి, కాజీపేట



న్యూస్‌రీల్

ఉన్నతి శిక్షణను వినియోగించుకోవాలి



విద్యారణ్యపురి: విద్యార్థుల్లో అభ్యసనాభివృద్ధికి ఉన్నతి శిక్షణ దోహదపడుతుందని, ఈశిక్షణను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్, రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ రవికాంతారావు అన్నారు. శనివారం హనుమకొండలోని లష్కర్‌బజార్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లోని ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాలను ఆయన సందర్శించారు. హనుమకొండ జిల్లాలో ఏడు శిక్షణ కేంద్రాల్లో రెండో దశ శిక్షణ ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, కోర్సు డైరెక్టర్లు అనురాధ, సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్లు మహేశ్, గౌస్ పాషా, అన్వర్, గిరిధాచారి, వెంకటేశ్వర్లు భూమలింగం పాల్గొన్నారు. రెండో దశ శిక్షణలో ఏడు సబ్జెక్టుల్లో 674 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు.

17న మెగా జాబ్ మేళా



కాశిబుగ్గ: యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 17న వరంగల్ దేశాయిపేట ఒయాసిస్ పబ్లిక్ స్కూల్‌లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలని పోలీస్ కమిషనర్ రంగనాథ్ అన్నారు. శనివారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు కమిషనర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వీపీపీఎస్ సాఫ్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ ఆడెపు వెంకటేశ్, హెచ్‌ఆర్ మేనేజర్ సుప్రియ, కాన్సెప్ట్ డిజైనర్ ప్రవీణ, జూలూరు నైనేశ్, కార్తీక్‌గౌడ్, సలీం, పలు కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

నిట్‌లో క్విజ్ పోటీలు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శనివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అఖిల భారత స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఖమ్మం, సూర్యాపేట, సిద్దిపేట, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని పాఠశాల స్థాయి విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. విజేతలకు ప్రొఫెసర్ సోమశేఖర్, బ్యాంక్ సీజీఎం భాస్కర్‌రావు, సత్యం బహుమతులు అందించారు.

జిల్లా స్థాయి వారధి పోటీల విజేతలు వీరే..

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా స్థాయి వారధి వ్యాస రచన, వక్తృత్వ పోటీలను శనివారం ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో పరకాలలోని జెడ్పీ హైస్కూల్ బాలికలు సాత్వికరామ్, మణిదీప్‌సాయి ప్రథమ స్థానం సాధించి విజేతలుగా నిలిచారు. అలాగే.. వక్తృత్వపోటీల్లో హసన్‌పర్తికి చెందిన టీఎస్‌ఆర్‌ఎస్ పాఠశాల బాలికలు ఎస్.వినోతారెడ్డి, ఆరూప్య విజేతలుగా నిలిచారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీల్లో వీరు పాల్గొంటారని జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఈరాష్ట్ర స్థాయి ఎంపిక కార్యక్రమంలో ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జి.ఉప్పలయ్య, జిల్లా అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారి టి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



వైఎస్సార్‌కు నివాళి

హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్ దాల్వీ, బండ్రు శోభారాణి, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

- హన్మకొండ చౌరస్తా

'ఇన్నర్'.. ఇంకెంత దూరం!

- రూ.50 కోట్లతో 8 కిలోమీటర్ల మేర నిర్మాణానికి 'కుడా' ప్రణాళికలు
- మంత్రి కేటీఆర్ పలుమార్లు ప్రస్తావించినా ముందుకు పడని అడుగు
- ఇప్పటికీ టెండర్ దశలోనే ప్రాజెక్టు.. ప్రారంభానికి ఇంకా సమయం
- అక్టోబర్‌లో కాకుంటే.. ఎన్నికల తర్వాతే పనులు మొదలయ్యే చాన్స్
- రింగ్‌రోడ్డు పూర్తయితే వరంగల్ సిటీపై తగ్గనున్న ట్రాఫిక్ ఒత్తిడి
- కుడి, ఎడమ వైపు రహదారులు.. మధ్యలో గ్రీనరీ ఉండేలా ప్లాన్



సాక్షి, వరంగల్ : వరంగల్ నగరంపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించే 'ఇన్నర్ రింగ్ రోడ్డు' నిర్మాణం ఇంకా ఆరంభంలోనే ఉంది. దాదాపు 8 కిలోమీటర్ల మేర రహదారి పనులకు టెండర్లు పిలిచిన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) అధికారులు.. అవి ఫైనల్ చేయాలంటే మరో నెల రోజుల సమయం తీసుకునే అవకాశం ఉంది. టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్లు ఫైనల్ చేసిన తర్వాతే సంబంధిత కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించనుంది.

ఈలెక్కన చూసుకుంటే ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు అక్టోబర్‌లో ప్రారంభమవుతాయని అనుకున్నా.. ఆలోపు ఎన్నికల కోడ్ వస్తే మళ్లీ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కొన్నేళ్లుగా అదిగో ఇదిగో అంటున్న పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంపై వాహనదారులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి కేటీఆర్ వరంగల్ నగరంలో పర్యటించిన పలు సందర్భాల్లో ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం పనులు అనుకున్నంత వేగంగా ముందుకు కదలకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా తయారైంది. కాగా.. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే నగరంలో భారీ వాహనాల రాకపోకలు తగ్గనుండడంతోపాటు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉంది. ములుగు నుంచి ఖమ్మం వైపు వెళ్లేవారు వరంగల్ సిటీకి రాకుండానే నేరుగా ట్రాఫిక్ ఫ్రీగా సమయాభావంతో వెళ్లే అవకాశముంది. దీనివల్ల సిటీలో ట్రాఫిక్ ఫ్రీ జర్నీకి కూడా చాన్స్ ఉండనుంది.

రూ.50 కోట్ల అంచనాతో టెండర్..

ఈరోడ్డు నిర్మాణానికి 'కుడా' రూ.50 కోట్లు అంచనా వేస్తూ.. టెండర్‌ను పిలిచింది. ఈటెండర్ దక్కించుకున్న సంస్థ 24 నెలల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫోర్ లేన్ రహదారిని విభిన్నంగా నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. రోడ్డు చుట్టు పక్కల ఉన్న స్థలం కబ్జాకు గురికాకూడదనే ఉద్దేశంతో స్థలం ఎంత వరకు ఉందో అంత వరకు రోడ్డు నిర్మాణం చేయనున్నారు. కుడి, ఎడమకు రెండు, రెండు లేన్ల రహదారి నిర్మించడంతో పాటు మధ్యలో బఫర్ కోసం చాలా స్థలం వదిలి గ్రీనరీని పెంపొందించేలా ప్లాన్ రూపొందించారు. దీనివల్ల భవిష్యత్‌లో రోడ్డు ఇంకా కావాలనుకుంటే ఈ బఫర్ జోన్‌ను తొలగించి అందులో నుంచే రోడ్డు వేసేలా సరికొత్త ప్రణాళిక చేశారు. 'నాయుడు పెట్రోల్ బంకు, తిమ్మాపూర్, ఫోర్ట్ వరంగల్, గొర్రెకుంట మీదుగా ఏనుమాముల వరకు 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణం తొలుత చేపట్టనున్నారు. ఆతర్వాత మిగిలిన మూడు కిలోమీటర్ల మేర ఆరెపల్లి వరకు నిర్మాణం జరగనుంది. ఈప్రాజెక్టు కోసం ఆస్తుల సేకరణకు దాదాపు రూ.120 కోట్ల మేర చెల్లించారు. ఈ బిడ్ దక్కించుకున్న సంస్థ 24 నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా నిబంధనలు ఉన్నాయి. 200 ఫీట్లతో నాలుగు లేన్ల రహదారి ఉంటుంది' అని 'కుడా' అధికారులు తెలిపారు. ఇప్పటికే ఇన్నర్ రింగ్ రోడ్డు తొలి దశలో భాగంగా కాజీపేట డీజిల్ కాలనీ (కడిపికొండ ఫ్లై ఓవర్), భట్టుపల్లి, ఉర్సుగుట్ట ఖమ్మం రోడ్డు, నాయుడు పెట్రోల్ బంకు వరకు 12 కిలోమీటర్ల రహదారి పనులు కొన్నేళ్ల క్రితం పూర్తి అయి వాహనదారులకు అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే.

మభ్యపెడుతున్న బీజేపీ, బీఆర్ఎస్

- ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్ర ఉత్తమ్ దాల్వీ
- 'పశ్చిమ' సమీక్షలో నాయిని వర్సెస్ జంగా నినాదాలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఉత్తమ్ దాల్వీ

హన్మకొండ చౌరస్తా: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికార ఒప్పందంతో ఉద్యమాలు చేస్తున్నట్లు నటిస్తూ తెలంగాణ ప్రజలను మభ్యపెడుతూ, మోసం చేస్తున్నాయని ఏఐసీసీ పరిశీలకుడు, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్ దాల్వీ అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమీక్షను డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈనెల 4 నుంచి చేపట్టనున్న హనుమకొండ సంకల్పయాత్ర పోస్టర్లను దాల్వీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సిన నిధులను బీజేపీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని, అధికారాన్ని అడ్డు పెట్టుకుని అందినకాడికి దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను గద్దె దించాలని, కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కోవర్టులతో ప్రమాదం..

డీసీసీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో కోవర్టులతో ప్రమాదముందని, అధికార పార్టీ నాయకుల ప్యాకేజీలకు అమ్ముడుపోయి కన్నతల్లి వంటి కాంగ్రెస్ పార్టీకి అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామన్నారు. పార్టీ డిక్లరేషన్లను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కలిసికట్టుగా పని చేస్తూ ముందుకు సాగాలన్నారు.

పరస్పర నినాదాలు..

సమావేశం ప్రారంభమైన పది నిమిషాలకు డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తన అనుచరగణంతో డీసీసీ భవన్‌కు చేరుకున్నారు. జంగా వస్తుండగానే.. ఆయన అనుకూల వర్గం జై జంగా రాఘవరెడ్డి అంటూ నినదించారు. అక్కడే కూర్చున్న డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి వర్గం జై నాయిని అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పరిస్థితి చేయిదాటకముందే ఏఐసీసీ పరిశీలకుడు దాల్వీ, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి జోక్యం చేసుకుని నినాదాలు చేయొద్దని వారించారు. దాదాపు మూడు గంటల పాటు సమీక్ష సాగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పార్లమెంట్ సమన్వయకర్త డాక్టర్ రియాజ్, నాయకులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, తోట వెంకటేశ్వర్లు, బంక సరళ, బొమ్మతి విక్రమ్, డాక్టర్ పి.రామకృష్ణ, మీర్జా అజీజుల్లాబేగ్, కత్తుల కవిత, గాండ్ల స్రవంతి, గుంటి స్వప్న పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

అడ్డుకున్న చిరు వ్యాపారులు



నిట్ వద్ద ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపును అడ్డుకుంటున్న వ్యాపారులు

వరంగల్ అర్బన్: కాజీపేట ఎన్ఐటీ, వడ్డేపల్లి రోడ్డులో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు శనివారం ఉద్రిక్తంగా మారింది. బంధం చెరువుకు వెళ్లే రహదారిలో ఉన్న పెద్ద డబ్బాలను ప్రొక్లెయినర్‌తో తొలగించేందుకు ప్రయత్నించగా.. తమ స్థలమని, డాక్యుమెంట్ కూడా ఉందని, ప్రస్తుతం కోర్టు కేసులో పెండింగ్‌లో ఉందని వ్యాపారులు అడ్డుకున్నారు. దీంతో బల్దియా ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ డబ్బాలను వదిలేసి.. ప్రధాన రహదారుల్లో చిన్న చిన్న డబ్బాలు, తడకలు తదితర ఆక్రమణలు తొలగించారు. స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలోని కూడళ్లను సుందరీకరించనున్న నేపథ్యంలో.. ఫుట్‌పాత్‌లపై ఉన్న డబ్బాలను అధికారులు దగ్గరుండి తొలగించారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది, శానిటేషన్, డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపరూ..

ఆక్రమణల్ని తొలగిస్తున్నారు సరే.. మరి మేం, మా కుటుంబాలు బతకడమెలా? అని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాలని కోరారు. హనుమకొండ ప్రాంతంలో ఐదు చోట్ల హాకర్స్ జోన్లు ఏర్పాటు చేశారని, కాజీపేటలో ఒక్కటి కూడా లేదని చిరువ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షురూ

- నేటి నుంచి బదిలీలకు దరఖాస్తులు
- సెప్టెంబర్–1 కటాఫ్ డేట్

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై జిల్లా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఆదివారం నుంచి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. సీనియార్టీ జాబితాలను గతంలో రూపొందించినప్పటికీ మళ్లీ ఆరు నెలలు గడవడంతో మార్పులు జరగనున్నాయి. అందుకు సంబంధించి సీనియార్టీ జాబితాలను సిద్ధం చేస్తున్నారు. మార్గదర్శకాల ప్రకారం.. సెప్టెంబర్ ఒకటో తేదీన కటాఫ్ డేట్‌గా నిర్ణయించారు. లాంగ్ స్టాండింగ్ ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్లు, హెచ్‌ఎంలకు ఐదేళ్లు ఒకేచోట పని చేసిన ఉపాధ్యాయులకు తప్పనిసరిగా బదిలీ చేస్తారు. ఉద్యోగ విరమణకు మూడేళ్ల సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులకు తప్పనిసరి బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. బదిలీల ప్రక్రియ నిలిచి ఆరు నెలలు గడిచిపోయాయి. ఎనిమిదేళ్లు, ఐదు సంవత్సరాల సర్వీస్ ఉండి ఒకే చోట పని చేసే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

1,300 దరఖాస్తులు

హనుమకొండ జిల్లాలో గతంలో బదిలీలకు సుమారు 1,300 మంది వరకు వివిధ కేటగిరీల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు కొత్తగా దరఖాస్తులు స్వీకరించనున్నారు. దీంతో దరఖాస్తుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను ఎడిట్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 2,693 మంది ఉపాధ్యాయ పోస్టులకు 2,375 మంది పని చేస్తున్నారు. 318 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

తప్పనిసరి బదిలీలు 432

హనుమకొండ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి తప్పనిసరిగా బదిలీ అయ్యేవారు 432 మంది ఉపాధ్యాయులున్నట్లు అధికారులు గుర్తించారు. జీహెచ్‌ఎం కేడర్‌లో తప్పనిసరి బదిలీ అయ్యేవారు 35 మంది ఉండగా.. అందులో ఇప్పటికే దరఖాస్తులు చేసిన వారు 19 మంది ఉన్నారు. ఇంకా 16 మంది దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. స్కూల్ అసిస్టెంట్ల కేటగిరీలో 138 మంది తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. అందులో ఇప్పటికే 115 మంది దరఖాస్తులు చేసుకోగా.. ఇంకా 23 మంది దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఎస్‌జీటీ కేటగిరీ ఉపాధ్యాయులు 259 మంది తప్పనిసరిగా బదిలీ అవుతారని గుర్తించారు. అందులో ఇప్పటికే 221 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇంకా 38 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా గుర్తించారు.



ప్రతిభకు గుర్తింపు

- ఉమ్మడి జిల్లా నుంచి 8మంది ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపిక
- బోధనలో వినూత్నం
- 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం రోజు అవార్డుల ప్రదానం

- 8లో▸

జీజీటీఈ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో శనివారం గవర్నమెంట్ గెస్ట్ టీచర్ ఎడ్యుకేటర్స్ (జీజీటీఈ) అసోసియేషన్ సమావేశం జరిగింది. సభ్యులు పలు సమస్యలపై చర్చించిన అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బూర విద్యాసాగర్, అధ్యక్షుడిగా డాక్టర్ మార్క శంకర్ నారాయణ, ఉపాధ్యక్షుడిగా కస్తూరి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా మారోజు సోమయ్య, సహాయ కార్యదర్శిగా బూర భిక్షపతి, కోశాధికారిగా మల్లేశాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

వరంగల్ లీగల్: ఈనెల 9న హనుమకొండ జిల్లా కోర్టు, పరకాల మండల కోర్టులో వేర్వేరుగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి కృష్ణమూర్తి తెలిపారు. శనివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్జి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగు కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగకుండా ప్రశాంత జీవనాన్ని కొనసాగించాలన్నారు. కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని సూచించారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు ఇప్పటికే పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఎక్సైజ్ శాఖ, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులు, చిట్ ఫండ్ మేనేజర్లతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 519 కేసుల కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటిలో క్రిమినల్ 324, ఎన్ఐ యాక్ట్ 35, ఎంవీసీటీ 80, వివాహ సంబంధిత 19, అదర్ సివిల్ 61, ప్రీ లిటిగేషన్ కేసులు 2500 ఉన్నట్లు తెలిపారు. కక్షిదారులు తమ వీలును బట్టి ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు.. రాజీ కుదుర్చుకునేలా ప్రీలోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి సలహాలకైనా, సందేహాలకైనా న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించాలని, ఉచిత న్యాయ సలహాలు పొందాలని జడ్జి కోరారు.

CHRISTU JYOTHI
INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
(A Catholic christian minority institution)
(APPROVED BY AICTE & AFFILIATED TO JNTUH) Website: www.cjits.ac.in
ESTD: 1998
ECET CODE: CJIT
Colombonagar, Yeshwanthapuram, JANGAON (Mdl. & Dist.) 506167.
SPOT ADMISSIONS FOR
B.Tech II Year (Lateral Entry) TSECET-2023
The students TSECET-2023 qualified or not qualified and not taken admission (B.Tech II year lateral entry scheme) in to any where are informed to attend for spot admission on 06-09-2023 at 11.00 AM with all original certificates, 4 photos and necessary fees. The seats will be filled as per guidelines prescribed by Convener TSECET-2023.
Courses offered :
CIVIL, CSE, CSE (AI & ML), ECE, EEE & MEC
Separate Hostel facility is available for Boys & Girls
Contact : 9346474916 & 9866348580
FR. D. VIJAYA PAUL REDDY
Director / Correspondent

క్లుప్తంగా

నిందితులకు 14 రోజుల రిమాండ్

దామెర: మైనర్ ఆత్మహత్య కేసులో నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు పరకాల రూరల్ సీఐ మల్లేష్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని కోగిల్వాయి గ్రామంలో గత నెల 29న మైనర్ బాలిక(వివాహిత) బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్త పెరుగు రాజు, అతని తల్లిదండ్రులు కోమల, చేరాలు, మేనత్త బుచ్చమ్మ, మామ రాజాలు వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. కాగా శనివారం వారిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా 14రోజుల పాటు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

తప్పు చేస్తే చర్యలు తప్పవు

ఆదాయపు పన్ను కమిషనర్ బాలకృష్ణ



మాట్లాడుతున్న బాలకృష్ణ

రామన్నపేట: దేశంలోని విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇతర దార్మిక అధ్యాత్మిక సంస్థలకు ఆదాయపు పన్ను చట్టం కింద ఇచ్చిన మినహాయింపులో సరిగా క్లెయిమ్ చేయకపోయినా, ఉద్దేశపూర్వకంగా తప్పుగా క్లెయిమ్ చేసినా.. వడ్డీ పెనాల్టీతోపాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ బాలకృష్ణ స్పష్టం చేశారు. పోచమ్మమైదాన్‌లోని రత్న హోటల్‌లో పలు వాణిజ్య వ్యాపార సంస్థల ప్రతినిధులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థలు, అధ్యాత్మిక సంస్థలు మినహాయింపులు ఉన్నవారు పాత రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ ఈ నెల 30వ తేదీలోగా మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే పాత సంస్థలు రిజిస్ట్రేషన్ అవకాశం కోల్పోయినట్లేనని పేర్కొన్నారు. విద్యాసంస్థలు వారి ఫీజులు రూ.5కోట్ల లోపు ఉంటే సకాలంలో రిటర్న్ దాఖలు చేస్తే మినహాయింపు పొందవచ్చన్నారు. అనేక సంస్థలు నిజాయితీతో కాకుండా తప్పుడు క్లెయిమ్స్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు జూపాల్, విజయ్‌కుమార్, సాయి, టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు త్రిపురనేని గోపిచంద్, సీఏలు తోట కరుణాకర్, శ్రవణ్‌కుమార్, హరికృష్ణ, సత్యనారాయణ, సుధాకర్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



SVS GROUP OF INSTITUTIONS
HANUMAKONDA, TS - 506 015.
(Approved by AICTE, New Delhi & Affiliated to JNTU Hyderabad)
Phone No.s : 9849509036, 9391949237
TSECET 2023-24 SPOT ADMISSIONS
Applications are invited for joining in to Direct II - Year B.Tech (Lateral Entr Scheme) CSE, CSE (AI&ML), CSE (Data Science), ECE, EEE, CIVIL & MECH course upto 6/9/23 from the candidates who have passed Diploma / B. Sc Examination with mathematics as subject having 44.5% and above (OC), 39.5% and above (BC/SC/ST) are to be considered. The vacant seats will be filled as per the guidelines given by The Convenor, TSECET - 2023. After proper scrutiny, spot admissions will be made on 06-09-2023 at 3:00 pm in the institutional premises. Eligible candidates shoud attend the spot admission along with relevant original certificates and prescribed fee.
Sd/- SECRETARY

2018లోనే 'మన ఊరు -మన బడి' వాట్సాప్ గ్రూపు



శ్రీధర్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు రామసహాయం శ్రీధర్ రెడ్డి 2023 సంవత్సరానికి గాను రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. తాను చదివిన పాఠశాలలోనే పనిచేస్తూ 2018లోనే మన ఊరు మనబడి పేరుతో వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో 25 సంవత్సరాల బోధన అనుభవంతోపాటు సామాజిక స్పృహ కూడా మెండుగానే ఉన్న శ్రీధర్‌రెడ్డి జాతీయ స్థాయి ఖోఖో క్రీడాకారుడిగా, కబడ్డీ క్రీడాకారుడిగా, ప్రతాపరుద్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్స్ నిర్వహించేవారు. మిత్రుల సహకారంతో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ, నోట్ బుక్కులు, పరీక్ష ప్యాడ్లు మొదలైనవి ఇచ్చేవారు. శ్రీధర్ రెడ్డి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ బాబు, సర్పంచ్ సంద వీరన్న, ఎస్ఎంసీ చైర్మన్ చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు.

మెరుగైన బోధనతో రాష్ట్రస్థాయి అవార్డు



సురేష్

ఖానాపురం: పుస్తకాల్లో ఉన్న విషయాలతోపాటు సమాజంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఆయన నైజం. ఆయనే ఖానాపురం మండలంలోని బుధరావుపేట హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు సుతారి సురేష్. 1998లో సెకండరీ ఉపాధ్యాయుడిగా ఎంపికై 2009లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన ఆయన ఫిజికల్ సైన్స్‌ను అర్థమయ్యే రీతిలో బోధిస్తారనే పేరుంది. మండల స్థాయిలో అనేక ఎక్సిబిట్స్ తయారీ చేయించి చెకుముఖీ టాలెంట్ టెస్టులు సైతం నిర్వహించారు. తన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పలు పోటీల్లో పాల్గొనేలా చొరవచూపారు. ఇలా విద్యార్థులు సైన్స్‌లో రాణించేలా తీర్చిదిద్దుతూ ప్రభుత్వ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యాడు. కాగా ప్రస్తుతం డిప్యూటేషన్‌పై మట్టెవాడలో పని చేస్తున్న సురేష్ అవార్డుకు ఎంపిక కావడంతో పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయవృత్తి.. సామాజిక సేవ



కూరపాటి సుశీల

దుగ్గొండి: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కూరపాటి సుశీల ప్రత్యేక కేటగిరి విభాగంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. సుశీల 2021నుంచి దుగ్గొండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. 2014లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. ఉగాది వేడుకలను పురస్కరించుకుని ఆల్‌ఇండియా రేడియోలో కథా నీరాజనం పేరిట విద్యార్థులచేత కార్యక్రమాలు చేయిస్తుంది. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా 2018లో అధిక మొక్కలు నాటి సంరక్షించిన విభాగంలో రాష్ట్రస్థాయి ఉత్తమ వనమాలి అవార్డును అందుకుంది. కవయిత్రిగా, కథా రచయితగా అనేక కార్యక్రమాలు చేసింది.

ప్రతిభకు గుర్తింపు

రాష్ట్ర స్థాయి అవార్డులకు ఉమ్మడి జిల్లా నుంచి 8 మంది ఉపాధ్యాయులు ఎంపిక

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి. తాను నేర్చుకుంటూనే విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి కార్పొరేట్ విద్యాసంస్థల ప్రాబల్యం పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పేదమధ్యతరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు, మెరుగైన విద్యాబోధనకు కృషి చేస్తున్న ఉమ్మడి జిల్లాలోని 8మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం ఉత్తములుగా గుర్తించి, అవార్డుకు ఎంపిక చేసింది. వీరికి ఈనెల 5వ తేదీన హైదరాబాద్‌లో అవార్డులు అందజేయనున్న నేపథ్యంలో వారు చేసిన సేవలు, తదితర అంశాలు..



వంద మందిని చేర్పించిన ఏకోపాధ్యాయుడు



లింగమూర్తి

నెల్లికుదురు: నలుగురు విద్యార్థులతో మెదలైన ఏకోపాధ్యాయుడి విద్యా పోరాటం 100 మంది విద్యార్థులతో 4వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంతో విజయవంతంగా కొనసాగుతోంది. మండలంలోని జామతండా ప్రాథమిక పాఠశాలకు 2012 సంవత్సరంలో పి.లింగమూర్తి ఉపాధ్యాయుడిగా వచ్చారు. గ్రామ ప్రజలు, యువజన సంఘాల సహకారంతో విద్యార్థుల సంఖ్యను నలుగురి నుంచి ఏకంగా 100 వరకు చేర్చి అందరిచేత ప్రశంసలు పొందాడు. ఈసందర్భంగా అవార్డుకు ఎంపిక కావడంపై లింగమూర్తి హర్షం వ్యక్త చేస్తూ.. గ్రామస్తులు, యువకుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక కేటగిరిలో ఎంపిక



అరుంధతి

లింగాలఘణపురం: తాను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తు చేయనప్పటికీ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల మౌలిక వసతులు, వంద శాతం ఎన్‌రోల్‌మెంట్‌కు చేసిన కృషిని గుర్తించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తించడం ఆనందంగా ఉందని ఉపాధ్యాయురాలు అరుంధతి అన్నారు. లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల ఉన్నత పాఠశాల బయో సైన్స్ ఉపాధ్యాయురాలు దొమ్మాట అరుంధతి రాష్ట్ర స్థాయి ప్రత్యేక కేటగిరిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. గ్రామస్తుల నుంచి సేకరించిన విరాళాలతో విద్యార్థులకు వసతుల కల్పన, విద్యార్థులను బడిలో చేర్పించడం వంటి కార్యక్రమాలను అరుంధతి చేపట్టారు. దీంతోపాటు 2016 నుంచి 2020 వరకు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంలో కృషి చేశారు.

విద్యార్థులతోపాటే యూనిఫాం



కొడిపాక రమేష్

కేసముద్రం: విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవాలని, ప్రతిరోజూ యూనిఫామ్ ధరించి పాఠశాలకు రావాలని విద్యార్థులకు చెప్పడంతోపాటు, హెచ్‌ఎం హోదాలో ఉండి విద్యార్థులు ధరించే యూనిఫాంలాంటి డ్రెస్‌తోనే పాఠశాలకు హాజరై వారిలో ఒకడిగా బోధన చేస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డుకు ఎంపికయ్యారు. మండలంలోని నర్సింహులగూడెం జీపీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కొడిపాక రమేష్. ప్రాథమిక పాఠశాలలో 2012 నుంచి పనిచేస్తున్న రమేష్ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వినూత్న రీతిలో పాఠాలను బోధిస్తున్నాడు. ప్రతి సెప్టెంబర్‌లో రోజుకు ఒక దాత సహకారంతో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడం, ప్రతి పాఠ్యాంశం ప్రత్యక్ష బోధన చేయడం, గత ఏడు సంవత్సరాలుగా చేయూత బుక్ స్టాల్ ద్వారా బోధన సామగ్రి అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నాడు. విద్యార్థులను ఉత్తమ ప్రతిభ కలిగిన వారిగా తీర్చిదిద్దడం కోసం నిరంతరం కృషి చేస్తున్నాడు.

ఓనమాలు నేర్చిన బడిలోనే..



అంబటి అంజయ్య

దేవరుప్పుల : ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి... అనే పాటకు భిన్నంగా ఇక్కడే పుట్టి.. ఇక్కడే చదివి.. ఇక్కడే ఉపాధ్యాయుడిగా రాణిస్తూ ఓనమాలు నేర్పిన బడి నిరాదరణకు గురౌతున్న తరుణంలో పూర్వవైభవం కోసం పాటుపడిన అంబటి అంజయ్య రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికవడం అభినందనీయం. దేవరుప్పులకు చెందిన అంబటి అంజయ్య అంగవైకల్యాన్ని ఎదిరించి ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందాడు. 2015 నుంచి దేవరుప్పుల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలను ముందుకుతీసుకెళ్తున్నాడు. నిస్వార్థసేవకు గుర్తింపుగా ఇప్పటికే వాసవీ, లయన్స్ క్లబ్, వరల్డ్‌విజన్, గోపా, వందేమాతరం ఫౌండేషన్ సంస్థలతోపాటు ఉమ్మడి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు. ఈ తరుణంలో అంజయ్యసార్‌కు రాష్ట్ర ఉత్తమ అవార్డు రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాట.. పాటలతో బోధన



శ్రీధరాచార్యులు

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ మండలం మాసుకుల్ అలీ జీహెచ్ఎస్ తెలుగు స్కూల్ అసిస్టెంట్ తన్నీరు శ్రీధరాచార్యులు వ్యాఖ్యతగా, గాయకుడిగా గుర్తింపుపొందడంతోపాటు విద్యార్థులకు సులభంగా బోధిస్తూ మన్ననలు పొందుతున్నాడు. రా రా.. బడికిరా.. షూస్ కట్టు, బ్యాగ్ పట్టు అనే పాట ద్వారా పిల్లలను ఆకట్టుకునే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. విద్యార్థులకు నోట్ బుక్స్, ఇతర వస్తువులు స్వంత ఖర్చులతో సమకూర్చడం, దాతల సాయంతో బడి అభివృద్ధికి కృషి చేశారు. అంతే కాకుండా విద్యాశాఖ నిర్వహించే అనేక సాంస్కృతిక కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. 2018 నుంచి వరంగల్ మాసుమలీ (ఎల్బీనగర్) ఉపాధ్యాయుడిగా కొనసాగుతూ.. 2004లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ ఎన్.వి.వేణుగోపాల చారి తెలిపారు. వినియోగదారులకు సౌకర్యంగా ఉండేందుకు వినియోగదారుల ముంగిట లోకల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలు, విద్యుత్ సర్వీస్ మంజూరు, మీటర్ రీడింగ్‌లో పొరపాట్లు, ఇతర సమస్యలు ఈ కోర్టు దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ నెల 5న వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ చెన్నారావుపేటలోని సబ్ స్టేషన్‌లో లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు వివరించారు. అలంకానిపేట, చెన్నారావుపేట, నెక్కొండ సెక్షన్ కార్యాలయాల పరిధిలోని వినియోగదారులు ఈ కోర్టును వినియోగించుకోవాలని సూచించారు. 14న భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో చిట్యాల, మొగుళ్లపల్లి, రామకృష్ణాపూర్ సెక్షన్ కార్యాలయం పరిధిలోని వినియోగదారులు సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు



వీసీ, రిజిస్ట్రార్‌లతో వాగ్వాదం చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పలు విభాగాల్లో పీహెచ్‌డీ రెండో కేటగిరి అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వివిధ విద్యార్థిసంఘాల బాధ్యులు ఆందోళనకు దిగారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలో వీసీ ఆచార్య తాటికొండ రమేష్ పలువురు ఆచార్యులతో కలిసి అకాడమిక్ కమిటీ హాల్‌లో సమావేశమై ఉండగా పలు విద్యార్థి సంఘాల బాధ్యులు అక్కడకు వెళ్లి వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావుతో వాగ్వాదానికి దిగారు. పొలిటికల్ సైన్స్‌లో 10సీట్లు ఉంటే మూడు సీట్లలో ఓసీ కేటగిరీ అభ్యర్థులకే అడ్మిషన్లు కల్పించారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో మూడు సీట్లు ఉంటే రెండు సీట్లు పార్ట్‌టైం చేసే అభ్యర్థులకే అడ్మిషన్లు కల్పించారని ఒక్కరికే ఫుల్ టైం అభ్యర్థికి అడ్మిషన్ కల్పించారని ఇది సరికాదని పేర్కొన్నారు. ఇంకా పలు విభాగాల అడ్మిషన్లలోనూ అవకతకలు జరిగాయని, ఆరోపిస్తూ విద్యార్థి ఉద్యమకారులకు సీట్లు రాలేదని తాము సమాజం కోసం పనిచేస్తున్నామని తమకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. వీసీ తాటికొండ రమేష్ మాట్లాడుతూ.. అన్ని విభాగాల పీహెచ్‌డీ ప్రవేశాలను మెరిట్ కమ్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ల ప్రకారమే నిర్వహించామని స్పష్టం చేశారు. విద్యార్థిసంఘాల బాధ్యులు మాట్లాడుతూ పీహెచ్‌డీ అడ్మిషన్లు పారదర్శకంగా జరిగితే ఇంటర్వ్యూలకు హాజరైన ప్రతి అభ్యర్థికి సంబంధించిన మార్కుల జాబితాలను ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు.అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యూనివర్సిటీ అధికారులకు అందజేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీసీ విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ లంకా రాజగోపాల్, ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ వడ్డెపెల్లి మధు, పాషా, రాకేష్, ప్రసాద్, కందికొండ తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

ఆ భూమిని 'పల్లా' తిరిగి ఇచ్చేయాలి

- దళితులపై కేసులు బనాయిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి..
- ప్రభుత్వ పక్షాన దళితులకు క్షమాపణ చెబుతున్నా..
- జనగామ చౌరస్తాలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అర్ధనగ్న ప్రదర్శన



అంబేడ్కర్ విగ్రహం వద్ద ముత్తిరెడ్డి అర్ధనగ్న ప్రదర్శన

జనగామ: దళితుల భూమిని ఎవరి పేరిట మార్పిడి చేయరాదని వేలిముద్రణ నిపుణులు నివేదిక ఇచ్చినా... ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అడ్డదారిలో పట్టా చేసుకున్నది వాస్తవం కాదా అని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రశ్నించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా ఆరోపణలు చేశారని పల్లా అనుచర వర్గానికి చెందిన ఓ వ్యక్తి బీఆర్ఎస్, దళిత సామాజిక వర్గానికి చెందిన విజయ్‌పై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో ఎమ్మెల్యే రోడ్డెక్కాల్సి వచ్చింది. ఆరోపణలు ఎదుర్కోలేని పల్లా రాజేశ్వర్‌రెడ్డి సొంత పార్టీ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు చేయించాడని ఆరోపిస్తూ శనివారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి జనగామ ఆర్టీసీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో 286 మంది దళితులకు చెందిన 16 ఎకరాల భూమిని పల్లా కుమారుడు అనురాగ్ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడన్నారు. భూమిని అమ్మే హక్కు కాస్తులో ఉన్న ఆ వ్యక్తులకు లేదని బాజాప్తాగా రాసి ఉన్నా పల్లా చట్టాన్ని మార్చి, దళితులకు అన్యాయం చేశాడన్నారు. డబ్బు మూటలతో జనగామ బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్నాడని తెలిపారు. సొంత పార్టీకి చెందిన దళిత నాయకుడు తిప్పారపు విజయ్ ఆరోపణలు చేస్తే, సమాధానం చెప్పాల్సింది పోయి, తన అనుచరులతో కేసులు పెట్టిస్తున్నారన్నారు. అట్టడుగున ఉన్న దళితులు ఆర్థికంగా ఎదగాలని సీఎం కేసీఆర్ ఓ పక్క సంకల్పిస్తుంటే, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాత్రం వారిపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం, కేసీఆర్ పక్షాన దళితులకు క్షమాపణ చెబుతున్నట్లు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తెలిపారు. తనపై ఎన్ని ఆరోపణలు చేసినా సమాధానం చెప్పానే తప్ప, ఎవరిపై కేసులు పెట్టలేదన్నారు. అధికార బలంతో దళితులపై అక్రమ కేసులు పెట్టించిన పల్లా వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. పల్లా బాధితులు తన వద్దకు వచ్చి, జరిగిన అన్యాయాన్ని చెప్పుకుని, అక్రమ రిజిస్ట్రేషన్ కాగితాలు చూపించారన్నారు. గతంలో పల్లాపై ఈడీకి ఫిర్యాదు చేసిన విషయమై మాట్లాడినట్లు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జాడలేని రాజేశ్వర్‌రెడ్డి, ఇప్పుడు డబ్బు సంచులతో రాజకీయం చేస్తున్నాడన్నారు. దళితులపై అక్రమ కేసులు పెట్టించిన పల్లాకు జ్ఞానోదయం కలగాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. పసుల ఏబేలు, కర్రె శ్రీనివాస్, తిప్పారపు విజయ్, మల్లిగారి రాజు, తిప్పారపు ఆనంద్, ఎండీ.సమ్మద్, మామిడాల రాజు, ఉల్లెంగుల సందీప్, లెనిన్, దేవునూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- వంటల లక్ష్మిగా నగరంలో గుర్తింపు
- ఓ ఫంక్షన్ హాలులో వంటల అనంతరం విద్యుత్‌షాక్



లక్ష్మి(ఫైల్)

వరంగల్: వరంగల్ నగరంలో వంటల లక్ష్మీగా గుర్తింపు పొందిన తిలక్‌రోడ్‌కు చెందిన భూక్య లక్ష్మీ(54) శుక్రవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. ములుగురోడ్డు సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహానికి వంటలు చేసేందుకు లక్ష్మీ వెళ్లింది. వంటలు పూర్తయిన తర్వాత అక్కడే ఉన్న ఐరన్ చైర్‌పై కూర్చోవడంతో లైటింగ్‌కు ఏర్పాటు చేసిన వైరుతో కరెంటు ప్రసారమై విద్యుదాఘాతానికి గురైనట్లు తెలిసింది. ప్రమాదానికి గురైన వెంటనే ప్రాథమిక చికిత్స అందించేందుకు ప్రయత్నించగా అప్పటికే ఆమె మృతి చెందింది. వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించడంతో శనివారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. సదరు ఫంక్షన్ హాల్ నిర్వాహకులు విషయం బయటకు పొక్కకుండా ప్రయత్నాలు చేసినప్పటికీ కాశిబుగ్గలో వంటల లక్ష్మీగా గుర్తింపు పొందడంతో అసలు విషయం బహిర్గతమైంది. ఆమెకు ఒక కూతురు ఉండగా భర్త పక్షవాతంతో బాధ పడుతున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం

హసన్‌పర్తి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకమని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం కిట్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో పేరు చెక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, ఇండస్ట్రీ జీఎం హరిప్రసాద్, కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, పీఆర్ఓ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

'టెట్'కు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

హన్మకొండ అర్బన్: ఈనెల 15న జిల్లాలో నిర్వహించనున్న టెట్ పరీక్షలకు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్లో సంబంధిత అధికారులతో టెట్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొత్తం 42 కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఓటరు నమోదు కేంద్రం తనిఖీ

కాజీపేట: కాజీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని శనివారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమెవెంట ఆర్డీఓ ఎల్.రమేష్, తహసీల్దార్ బావుసింగ్, సురేందర్, దశరథరాంరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, గీత, జ్యోతి, రాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే సీతక్క పీఏ దుర్మరణం



వెంకటనారాయణ (ఫైల్)

ములుగు: జిల్లా కేంద్రంలోని సాధన హైస్కూల్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ములుగు ఎమ్మెల్యే సీతక్క అంతర్గత పీఏ కొట్టం వెంకటనారాయణ (జబ్బర్) (36) దుర్మరణం పాలయ్యారు. వెంకటనారాయణ వ్యక్తిగత పనిమీద నర్సంపేటకు బైక్‌పై వెళ్లాడు. పని ముగించుకుని ములుగుకు చేరుకున్న ఆయన ఇంటికి వెళ్తున్న క్రమంలో సాధన హైస్కూల్ సమీపంలోకి రాగానే బైక్ స్కిడ్ అయ్యి డివైడర్‌ను ఢీకొట్టాడు. తల రోడ్డుకు బలంగా తగలడంతో తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే చనిపోయాడు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంకటనారాయణ సీతక్క వద్ద 8 సంవత్సరాలుగా అంతర్గత పీఏగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య సుమలత ఉంది. ఆమె స్థానికంగా కాంట్రాక్ట్ టీచర్‌గా పనిచేస్తుంది. ఒక కూతురు ఉంది. కాగా, హెల్మెట్ ఉంటే బతికేవాడని, తలకు బలమైన గాయాలు కావడంతో రక్తస్రావమై చనిపోయినట్లు స్థానికులు తెలిపారు.

విద్యార్థులకు కలెక్టర్ ప్రావీణ్య పరామర్శ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఎంజీఎం: వరంగల్ రంగశాయిపేటలోని సోషల్ వెల్ఫేర్ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ గురుకుల హాస్టల్ విద్యార్థులు 26 మంది జ్వరాల బారిన పడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. శనివారం వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఎంజీఎంను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. చికిత్స పొందుతున్న విద్యార్థుల పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు ఎంజీఎం పరిపాలనాధికారులు కలెక్టర్‌కు తెలిపారు. మలేరియా, డెంగి పరీక్షలు నిర్వహించగా.. నెగిటివ్ రిపోర్ట్స్ వచ్చాయని వారు పేర్కొన్నారు. రెండ్రోజుల తర్వాత డిశ్చార్జీ చేస్తామని తెలిపారు.

కళాశాలను సందర్శించిన కలెక్టర్

కరీమాబాద్: ఉర్సుగుట్ట సమీపంలోని తెలంగాణ ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను శనివారం వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు జ్వరాల బారిన పడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో.. కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. స్టోర్‌రూంతోపాటు వంట గదిని, పరిసరాల్ని పరిశీలించారు.

సంక్షేమ పథకాలపై సమీక్ష

కరీమాబాద్ : కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం కలెక్టర్ ప్రావీణ్య హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, బిందుసేద్యం, ఆసరా పెన్షన్లు, గొర్రెల పంపిణీ తదితర సంక్షేమ పథకాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ హన్మకొండ, పోస్టల్‌కాలనీలో 300 చ.గ.ల G+2 బిల్డింగ్ అమ్మకానికి కలదు. వెస్ట్ ఫేసింగ్, 100% వాస్తు గలది. సంప్ర: 9849283034. [W-785645]

PLOT FOR SALE

■ వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కి దగ్గరలో 40 లు॥కే Flat, రఘునాథ్‌పల్లి, ఆలేరు హైవేకి దగ్గరలో 6.50లు॥కే 121 Sq.yds మరియు యాదాద్రి = 15లు॥కే 150 Sq.yds సెల్: 8978657585. [WA-7220]

■ హన్మకొండ సప్తగిరి కాలనీలో 150 చ॥గ॥ల నార్త్ ఫేసింగ్ గల ప్లాటు అమ్మకానికి కలదు. (నోబ్రోకర్స్) సంప్ర॥ సెల్: 9441001574. [W-189162]

■ మడికొండ హైవే రోడ్డు ఖండాల దాబా ఎదురూ వాకబుల్ డిస్టెన్స్ G+1 పర్మిషన్ ఈస్ట్ సౌత్ రెండు రోడ్లు 169 గజాల ప్లాట్ సేల్ చేయబడును. గజానికి 24000, కాజీపేట, హనుమకొండ. సెల్ నెంబర్: 9848486768. [W-1229459]

■ హన్మకొండ చౌరస్తా నుండి 2KM దూరంలో 300 గజాల ప్లాటు తూర్పు ఫేస్ కలదు. ఒక రూమ్ కట్టి ప్లాటు చుట్టూ 5F గోడ గేట్ పెట్టినది. అమ్మకం గ॥ రూ॥ 23000/- ఫిక్స్‌డ్ నో బ్రోకర్స్. 9395561655. [W-785648]

SERVICES

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-1229404]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-189133]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

BUSINESS OFFER

■ కిరాణం ప్రొడక్ట్స్ బిజినెస్ కోసం 2 లక్షలు ఇన్వెస్ట్మెంట్ చేయగలవారు సంప్రదించండి. ప్రతి వారం 14 వేలు ఆదాయం. 6 నెలల వరకు అగ్రిమెంట్. జనగాం-81439 09459. [M-1221538]

WANTED

■ Male Only Marketing Executives - For Ready Mix Concrete Any degree, Accountants - Any Degree with Tally, Site Supervisors - Diploma / B.Tech Civil with for all 2-4 years Experience Drop your Resume on WhatsApp and Contact No: 7330891166, 8555890439, 9849277408 [WA-13357]

■ No Sales, No Targets, No Marketing Office work, Req: Basic Computer Knowledge, Fluent in Eng/ Tel. Opp: Asian Mall HNK. 9392475265, 8886331100. [W-189163]

■ సుబేదారి, హన్మకొండ అవర్ధ ఇ.ఎన్.టి హాస్పిటల్‌లో పనిచేయుటకు సిస్టర్స్ మరియు ఆయాలు కావలెను. సంప్ర. 8790533900, 7981911321. [W-1229460]

■ అన్నురెడ్డి గ్రాఫిక్స్‌లో All Online Applications చేయడానికి ఎంప్లాయిస్ కావలెను. అడ్రస్: సంజూస్ కాలనీ రోడ్, Opp: భవాని ఆర్ట్స్, వికాస్‌నగర్, హన్మకొండ. సెల్: 9000009359. [W-189164]

■ మా రియల్‌ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు అసోసియేట్ మెంబర్స్ మరియు టెలికాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటీవ్స్ + కమీషన్ ఇవ్వబడును. సంప్ర॥ 9959567858. [W-189148]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221536]

■ GNM నర్సులు, Dialysis టెక్నీషియన్స్ & OT టెక్నీషియన్స్ కావలెను. Contact: GUARDIAN HOSPITAL, Mulugu 'X' Road, Warangal. Time: 12 to 2pm. [WA-973]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000-16000. సెల్: 9703637320. [W-189147]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP No.1) విజయవాడ శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవచేయుటకు M/F కావలెను. భోజనం + వసతి కలదు. జీ: 15-16వేలు. ✆ 8247500792, 8247500683. [B-1206730]

■ హన్మకొండ, ఖాజీపేటలో సెక్యూరిటి గార్డ్స్ కావలెను. 12 hrs, జీతం: 12000/-, Hyd లో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను 12 hrs, 12000/-. Ph: 9642279111. [H-189525]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులు, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ : 9640468899, 9640258899 [H-189329]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.